క్లుప్తంగా

రైల్వేస్టేషన్‌లో టైల్స్ అమరిక పనులు చకచకా



నాలుగో నంబర్ ప్లాట్‌ఫారంపై టైల్స్ అమర్చుతున్న కూలీలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం ఆధునికీకరణ పనులు చేపట్టారు. స్టేషన్ ముఖ ద్వారం నుంచి తాడి, అనకాపల్లి వైపు వెళ్లే ప్లాట్‌ఫారంపై టైల్స్ అమర్చుతున్నారు. 90 మీటర్ల నిడివిలో యాంటీ స్కిడ్ టైల్స్ అమర్చడానికి రూ.కోటితో పనులు చేపట్టారు.మూడు రోజుల నుంచి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో ఉన్న కాంక్రీట్ ప్లాట్‌ఫారం ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ టైల్స్ అమర్చుతున్నారు.

శతృఘ్నుడికి అభినందనలు



అవార్డుతో అత్రా విశాఖ ఇన్‌చార్జి శతృఘ్నుడు

అక్కిరెడ్డిపాలెం: వినియోగ దారుల హక్కుల పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలు.. సేవలకు గుర్తింపుగా నగరానికి చెందిన తోట శత్రుఘ్నుడికి ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఈ నెల 15నన బెంగళూరులో నిర్వహించిన అత్రా 6వ జాతీయ సదస్సులో కర్ణాటక పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి మునియప్ప, ఐఏఎస్ విజయ్ జోత్స్న చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శత్రుఘ్నుడికి పలువురు అభినందనలు తెలిపారు.

న్యూపోర్టు సీఐగా కామేశ్వరరావు

పెదగంట్యాడ: న్యూపోర్టు సీఐగా తోటాడ కామేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉన్న కామేశ్వరరావు న్యూపోర్టు సీఐగా నియమించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న జి.దాలిబాబును సీసీఎస్-1కు బదిలీ చేశారు.

ఇంధన పొదుపుపై వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఈఈ పార్థసారథి, అధికారులు

అక్కిరెడ్డిపాలెం: జాతీయ ఇంధన వారోత్సవాలను పురస్కరించుకొని గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు విద్యుత్ వినియోగం, ఆదా వంటి విషయాలపై అవగాహన కల్పించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు గాజువాక డీఈ పార్థసారథి, ఏఈ ఆర్.వి. రామకృష్ణ, చినగంట్యాడ జేఈ కె.శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ ప్రశాంతి, విద్యుత్ శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాము పట్టివేత

అక్కిరెడ్డిపాలెం: మింది గ్రామం సమీపంలో ఉన్న గొడౌన్‌లో పాము హల్‌చల్ చేసింది. గొడౌన్‌లో మంగళవారం పాము దూరడం చూసిన కార్మికులు వెంటనే స్నేక్ క్యాచ్ సొసైటీ ఫౌండర్‌కు సమాచారం అందించారు. గొడౌన్ వద్దకు చేరుకున్న కిరణ్ పామును చాకచక్యంగా పటుకున్నారు. కాగా పామును నాగజెర్రి అంటారని, ఇది విషరహితమైన పాము అని కిరణ్ తెలిపారు. పాములు కనిపిస్తే చంపవద్దని కోరారు. పట్టుకున్న పామును నిర్జీవ ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు తెలిపారు.

పాలిథిన్..!

పర్యావరణానికి శత్రువు.. ప్రజల ఆరోగ్యానికి హాని..మూగ జీవాల ప్రాణాలకు ముప్పు.. అని తెలిసినా హానికారక పాలిథిన్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతుంది. పర్యావరణానికి సవాల్ విసురుతోంది. అలాంటి పాలిథిన్ వినియోగంపై పలు మార్లు విధించిన నిషేధం మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. తాజాగా జనవరి 1 నుంచి పాలిథిన్‌ను నిషేధించనుంది. జీవీఎంసీ యంత్రాంగం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అయినా విక్రయాలు, వినియోగం **తగ్గకపోవడంతో ఈ సారైనా పాలిథిన్ నిషేధం అమలయ్యేనా అన్న సందేహం తలెత్తుతోంది.**



ఈ సారైనా..!

- జనవరి 1నుంచి ప్లాస్టిక్ నిషేధం
- యథేచ్ఛగా పాలిథిన్ వినియోగం
- నిబంధనలను పట్టించుకోని వ్యాపారులు
- ప్రకటనలకే పరిమితమవుతున్న అధికారులు

పెదగంట్యాడ: జీవీఎంసీ పరిధిలో గతంలో పలు మార్లు పాలిథిన్ వినియోగాన్ని నిషేధించినా పట్టుమని నెల రోజులు కూడా అమలు కాలేదు. యథేచ్ఛగా వినియోగం జరుగుతోంది. దీంతో ఏ గెడ్డలో చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. మూగ జీవాల మృత్యువాతకు కారణమవుతున్నాయి. అలాంటి తరుణంలో మరోసారి జీవీఎంసీ యంత్రాంగం ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించింది. ఇందుకు గానూ డిసెంబర్ నెలంతా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జనవరి 1 నుంచి పక్కాగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని నిర్ణయించింది.

నిబంధనలు పట్టించుకోని వ్యాపారులు

గుడి, బడి, బజారు, కిరాణా షాపు, హోటళ్లు, మార్కెట్ ఇలా ఎక్కడికి వెళ్లినా ప్లాస్టిక్ కవర్లే దర్శనం ఇస్తున్నాయి. వ్యాపారులు తమ లావాదేవీల్లో నిత్యం విరివిగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. వ్యాపారులు కూడా ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోవడం లేదు. పెద్ద పెద్ద మాల్స్ వరకు ఎక్కడ చూసిన ప్లాస్టిక్ కవర్లలోనే అమ్మకాలు చేస్తున్నారు. మరో వైపు అధికారులు కాసులకు కక్కుర్తి పడి మూలాలపై దృష్టిపెట్టడం లేదని పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు.

విచ్చలవిడిగా అమ్మకాలు

ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ సంచులను, గ్లాసులను మార్కెట్లో విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. వాటి వినియోగం పర్యావరణానికి పెనుభూతంగా మారింది. అయినా ఉదయం నిద్ర లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ మనం **చేసే ప్రతి పనిలోనూ పాలిథిన్** వినియోగం ఉంటోంది. బయట నుంచి **టిఫిన్, కూరగాయలు తేవాలన్నా.. ఇంటికి సరకులు తీసుకురావాలన్నా,** ప్లాస్టిక్ **కవర్లనే వినియోగిస్తున్నారు. వాటి వాడకం వల్ల పర్యావరణానికి** ముప్పు **అని తెలిసినా మారడం లేదు.**



ప్లాస్టిక్ కవర్లో పువ్వులు, ఇతర సామగ్రి తీసుకు వెళ్తున్న మహిళ

పెరుగుతున్న వ్యర్థాలు

పాలిథిన్ కవర్లు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయాలు మండలంలో ఎక్కడిపడితే అక్కడ యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రతి రోజూ మండలంలో సుమారు రెండు నుంచి మూడు టన్నుల వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు బయట పడుతున్నట్టు అంచనా. గతంలో 40 మైక్రాన్ల తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్ల విక్రయాలపై నిషేధం విధించారు. వాటిని విక్రయించిన వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేయడంతో పాటు జరిమానాలు విధించారు. దీంతో వాటి వినియోగం కొద్దిరోజులు తగ్గింది. తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమక్రమంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం మళ్లీ పెరిగిపోయింది. కూరగాయలు, మాంసం, హోటళ్లు, బేకరీలు, కర్రీ పాయింట్లు, బార్లు వద్ద, శుభ కార్యాల విందుల్లో పాలిథిన్ వాడకాలు కని**పిస్తున్నాయి. వినియోగించిన తర్వాత ఆ వ్యర్థాలను రోడ్ల పైన, కాలువల్లో పడేస్తున్నారు. వీటి వల్లన** అపరిశుభ్ర **వాతావరణం నెలకుంటోంది. అంతేకాకుండా ఆయా వ్యర్థాల**ను పశువులు తినడంతో మృత్యువాత పడుతున్నాయని జంతు ప్రేమికులు వాపోతున్నారు.



రోడ్డుపై విచ్చలవిడిగా పడేసిన నిషేధిత ప్లాస్టిక్ సంచులు

నిషేధిత ప్లాసిటిక్, పాలిథిన్ నగరంలో ప్రవేశించకుండా వ్యాపారులకు చెక్ పెడితేనే ఈ సారైనా నిషేధం సాధ్యమవుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ప్లాస్టిక్ నిషేధంపై 74వ వార్డులో అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ అధికారులు

మూగజీవాలు విలవిల

ప్రజలు వినియోగించిన ప్లాస్టిక్ **కవర్లు** రోడ్లపై పడేవేయడంతో అవి **తిన్న మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి.** ప్రజలు కవర్లతో మిగిలిపోయిన ఆహారాన్ని పడేస్తున్నారు. అవి తినడంతో పశువుల కడుపులోకి ప్లాస్టిక్ వెళ్లడంతో మృత్యువాత పడుతున్నాయి.

పక్కాగా అమలు చేయాలి



పాలిథిన్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి. 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన వాటిని తయారు చేస్తున్న వారితో పాటు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి. పాలిథిన్ వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి.
–డాక్టర్ రమేష్‌బాబు, వైద్యాధికారి, పీహెచ్‌సీ పెదగంట్యాడ

1 నుంచి పూర్తిగా నిషేధం



వచ్చే ఏడాది 1 నుంచి పాలిథిన్‌ను పూర్తిగా నిషేధిస్తున్నాం. పాలిథిన్ కవర్లు తయారు చేసినా, విక్రయించినా కఠినంగా వ్యవహరిస్తాం. పాలిథిన్‌కు ప్రత్యామ్నాయంగా కాగితంతో తయారు చేసిన, గుడ్డ సంచులను వినియోగించాలి. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
–డాక్టర్ కిరణ్ కుమార్, ఎంహోహెచ్, జీవీఎంసీ జోన్–6

విద్యుత్ బిల్లుల దహనం



విద్యుత్ బిల్లులను తగుల బెడుతున్న సీపీఎం నాయకులు

అక్కిరెడ్డిపాలెం: పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 70వ వార్డు దళమికొండలో సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు అంటూ పేదలకు చుక్కలు చూపే విధంగా విద్యుత్ చార్జీలను పెంచారని దుయ్యబట్టారు. పేద ప్రజానికి పెను భారంగా మారిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి ప్రజలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.నర్సింగరావు, గొలగాని అప్పారావు, లోవరాజు, దాలినాయుడు, మంగ, వెంకటలక్ష్మి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి

పెదగంట్యాడ: వీధుల్లో పడేసిన వ్యర్థాలను ఏరుకుని జీవనం సాగిస్తున్న వారికి ఆర్థిక తోడ్పాటు అందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు గిరిజా కాలనీలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం పేదరిక నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురికివాడల్లోని ప్రజలను చైతన్యవంతుల్ని చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. అనంతరం 30 మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.500 నగదు, వంట సామగ్రి, చీపుళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, మృణాళిని, డీబీఆర్‌ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ నిఖిల, ధనలక్ష్మి, అజయ్, గురునాథ్, రమేష్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ: భూ సమస్యలను పరిష్కరించాలని, సకాలంలో కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని కోరుతూ బాధితులు పోటెత్తారు. పెదగంట్యాడ మండల తహసీల్దార్ పి.అమల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని చెప్పారు. సదస్సుల్లో బాధితుల అందించిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సదస్సుకు నోడల్ అధికారి శేష శైలజ, కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, దల్లి గోవింద్, బొడ్డు నర్సింహపాత్రుడు, తిప్పల వంశీరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్ భాస్కర్, నాయకులు ప్రసాదుల శ్రీనివాసరావు, పులి వెంకట రమణారెడ్డి, న్యూపోర్టు సీఐ దాలిబాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు.
సదస్సులో మొత్తం 37 అర్జీలు అందాయి. అందులో 23 అర్జీలు స్టీల్‌ప్లాంట్ భూములు ఆక్రమణకు గురయ్యాయని, మరో 7 గురు భూ సమస్యలపై, మరో ఏడుగురు ధ్రువీకరణ పత్రాల కోసం వినతులు అందజేశారు.

ఢిల్లీ వెళ్లిన ఉక్కు పోరాట కమిటీ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు జె. అయోధ్యరామ్, మంత్రి రాజశేఖర్, డి. ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావులు మంగళవారం ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఎంపీ వి. శివదాసన్ సారథ్యంలో బుధవారం కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని పార్లమెంట్ భవనంలో కలవనున్నారు. ఈ మేరకు వారికి కుమారస్వామి అపాయింట్‌మెంట్ ఖరారైంది. ఉక్కు ఉద్యోగుల వేతనాలు, స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వం రంగంలో కొనసాగింపు, సెయిల్‌లో విలీనం తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని నాయకులు తెలిపారు.

ఈపీఎస్-95 పెన్షనర్ల ధర్నా నేడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు చెందిన ఈపీఎస్–95 పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహిస్తున్నారు. రిటైర్డ్ స్టీల్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ సంయుక్తంగా కూర్మన్నపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ధర్నా చేయనున్నారు. హయ్యర్ పెన్షన్‌పై సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు అందిన డిమాండ్ నోటీసులపై ఈపీఎఫ్‌వోకు వందలాది కోట్ల రూపాయలు చెల్లించి 14 నెలలు పూర్తయినా ఇంత వరకు హయ్యర్ పెన్షన్ మంజూరు కాలేదని... ఈపీఎఫ్‌వో వైఖరికి నిరసనగా చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఈపీఎస్–95 పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు కోరారు.

ధర్నాను విజయవంతం చేయండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పెండింగ్ జీతాల కోసం బుధవారం ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని స్టీల్ సీఐటీయూ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి కోరారు. రెండు నెలలుకు చెందిన 85 శాతం జీతం, నవంబర్ నెలకు సంబంధించి పూర్తి జీతం చెల్లించకపోవడానికి నిరసనగా ఆందోళన చేపడుతున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం నిర్వహించనున్న ధర్నాలో ఉక్కు ఉద్యోగులతో కుటుంబ సభ్యులు హాజరుకావాలని కోరారు.

అథ్లెటిక్స్‌లో పతకాల పంట



పతకాలతో భాస్కరరావు

పెదగంట్యాడ: ఈ నెల 14, 15 తేదీల్లో గుడివాడలోని నందమూరి తారక రామారావు స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో ఉక్కు ఉద్యోగి మరల భాస్కరరావు సత్తా చాటారు. ఒక బంగారు పతకం, రెండు రజత పతకాలు సాధించారు. స్టీల్‌ప్లాంట్‌లో నీటి సరఫరా విభాగంలో జనరల్ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న భాస్కరరావు షాట్ పుట్ 60 ఏళ్ల విభాగంలో నాలుగు కిలోల ఇనుప గుండును 11.64 మీటర్లు విసిరి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. డిస్కస్ త్రోలో 23.64 మీటర్లు, హెమర్ త్రోలో సత్తా చాటి రజత పతకాలు సాధించారు.

అన్నదాన మూలనిధికి విరాళం అందజేత

అక్కిరెడ్డిపాలెం: ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిర్వహించే అన్నదాన మూల నిధికి మంగళవారం కూర్మన్నపాలెంకు చెందిన మాటూరి ప్రవీణ్, అనసూయ దంపతుల కుమారులు చర్విక్, శ్రీనివాసరావు రూ.10 వేల విరాళం అందజేశారు. దివ్యక్షేత్రంలో ఈ నెల 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు తిరుప్పావై సేవను ప్రతీ రోజు ఉదయం 4.30 గంటలకు నిర్వహించనున్నట్లు ప్రతినిధులు తెలిపారు.



బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న దాతలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మరొకరికి తీవ్రగాయాలు

అగనంపూడి: వడ్లపూడి ఫ్లైఓవర్‌పై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా.. నర్సీపట్నం మున్సిపాలిటీ జోగునాయుడుపాలేనికి చెందిన పి.వరహాలబాబు, మాజీ కౌన్సిలర్ వి. శ్రీనివాస్ ద్విచక్ర వాహనంపై గాజువాక వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా వడ్లపూడి ఫ్లై ఓవర్‌పై ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తొలుత అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అయితే కొన ఊపిరితో ఉన్న వరహాలబాబు(30)ని 108లో కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మాజీ కౌన్సిలర్ శ్రీనివాసరావు చికిత్స పొందుతున్నారు. దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్, జీవీఎంసీ సిబ్బంది

అగనంపూడి:ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. 79వ వార్డు శానిటరీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అగనంపూడి జగన్నాథస్వామి ఆలయం నుంచి జాతీయ రహదారి కూడలి వరకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లలో ఆహారం, పానీయాలు తీసుకోవడం వల్ల క్యాన్సర్ వంటి రోగాలు బారిన పడుతున్నామన్నారు. మరో వైపు వినియోగించి పడేసిన పాలిథిన్ సంచులను మూగ జీవాలు తినడంతో వాటి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతీ ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు బదులు గుడ్డ లేదా నార సంచులను వినియోగించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ వచ్చేనెల 1వ తేదీ నుంచి నగరంలో ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వస్తుందని చెప్పారు. విక్రయించినా, వినియోగించినా జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చిత్తా రామారావు, ఎ.రమాదేవి, సత్యనారాయణ, సింహాచలం, నాగేశ్వరరావు, నరసింగరావు, రుద్ర కుమార్, జగదీష్, రేవతి, హనిత, తాతారావు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణతో శాంతి



కళాకారులతో భాస్కరభట్ల సత్యప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: మానవతా విలువలు కాపాడాలంటే ప్రతి ఒక్కరూ తమలో ఉన్న దివ్యత్వాన్ని వ్యక్తీకరించాలని సంగీత పోటీల న్యాయనిర్ణేత భాస్కరభట్ల సత్యప్రసాద్ అన్నారు. త్రిశక్తి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత, భజనలు, కోలాటాలు, గీతాపారాయణం, రంగస్థలం, కోలాటం, పద్యాల పోటీల్లో పాల్గొన్న కళాకారులనుద్దేశించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అశాంతి, యుద్ధ వాతావరణం, అనారోగ్య వాతావరణ పరిస్థితుల్లో హైందవ సంస్కృతి విస్తృతికి ధర్మప్రచారకులు చేపడుతున్న యజ్ఞం వల్ల ప్రపంచ శాంతి నెలకొనాలని ఆయన ఆకాంక్షించారు. జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావం సభలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గంట్యాడనగర్ ప్రాంతీయ సభ్యులు లాభాల దుర్గాప్రసాద్, గొందేశి గురప్పరెడ్డి, నడింపల్లి శ్రీనివాసరాజు, పట్నాయకుని నాగేశ్వరరావు, త్రిశక్తి భజనమండలి సమన్వయకర్త బోనెల రాజారావు, మహిళా గాయకులు భవాని, అమ్మాజి, బొడ్డు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో వైద్యుల కోసం దరఖాస్తుల ఆహ్వానం



ఉక్కు జనరల్ ఆస్పత్రి

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆస్పత్రిలో సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, జనరల్ మెడిసిన్ విభాగాల్లో రెండేసి పోస్టుల చొప్పున మొత్తం 8 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఎంబీబీఎస్ అర్హతతో నియమించనున్న ఈ పోస్టులకు మొదటి ఏడాది రూ. 50 వేలు, రెండో సంవత్సరం రూ. 55 వేల చొప్పు స్టైఫండ్ చెల్లించనున్నారు. ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు, ఓబీసీలకు 3 ఏళ్ల సడలింపుతో 35 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితిగా నిర్ణయించారు. మొదటి ఏడాది సేవలు సంతృప్తికరంగా ఉంటే రెండో ఏడాది కొనసాగిస్తారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 30న ఉక్కు జనరల్ ఆస్పత్రి విభాగాధిపతి కార్యాలయానికి హాజరుకావాలి. ఆ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్, ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.